ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.12.2024 సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రేపటి నుంచి రెండు రోజులపాటు తెలంగాణలో పర్యటించనున్నారు. రేపు, మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ని ఐసీఏఆర్ - కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉపరాష్ట్రపతి సందర్శించనున్నారు.
2. హైదరాబాద్ లోని సంధ్యా థియేటర్ లో జరిగిన తొక్కిసలాట కేసులో నిందితుడిగా వున్న సినీ నటుడు అల్లు అర్జున్ ను ఈరోజు చిక్కడపల్లి పోలీసులు విచారిస్తున్నారు.
3. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
4. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన ఏడాది పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని కరీంనగర్ పార్లమెంట్ మాజీ సభ్యుడు బి.వినోద్ కుమార్ విమర్శించారు.

**VICE-PRESIDENT**

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రెండు రోజుల పర్యటనకై రేపు తెలంగాణకి రానున్నారు. ఉప రాష్ట్రపతి రేపు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి ICAR-కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారు. అక్కడ సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న 500 మంది రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. సేంద్రీయ రైతులను ఆయన సన్మానిస్తారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారు. అదే రోజు శంషాబాద్ లోని కన్హా శాంతివనంలో ఉప రాష్ట్రపతి బస చేస్తారు.

**DESK**

అల్లు అర్జున్

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నిందితుడిగా వున్న సినీ నటుడు అల్లు అర్జున్ ఈ ఉదయం చిక్కడ పల్లి పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరు అయ్యారు. జూబ్లీ హిల్స్ లోని ఆయన నివాసం నుంచి న్యాయవాదితో కలసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసులో అల్లు అర్జున్ కు నాలుగు వారాల పాటు తెలంగాణ హైకోర్టు ఇప్పటికే మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేష్, చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ రాజు నాయక్ అల్లు అర్జున్ ను విచారిస్తున్నారు.

పిటిసి హైదరాబాద్

CONSUMER AFFAIRS

జాతీయ వినియోగదారుల దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వినియోగదారుల చైతన్యానికి సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర

వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి జాగో గ్రాహక్ జాగో, జాగృతి యాప్లు, జాగృతి డాష్ బోర్డును ఈ సందర్భంగా ప్రారంభించారు. వినియోగదారుల ప్రయోజనాలకు భంగం కలిగించే అంశాలను పరిష్కరించడంలో కేంద్రీయ వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ CCPA సామర్థ్యాన్ని ఈ యాప్లు మెరుగుపరుస్తాయి. వినియోగదారులు ఆన్లైన్ లో జరిపే లావాదేవీ సమయంలో అపాయకర URL లు ఎదుర్కొన్నప్పుడు ఈ యాప్లు అప్రమత్తం చేస్తాయి. చట్టవ్యతిరేక లింక్ గా భావించే URL లు కనుగొన్నప్పుడు వినియోగదారులు చేసే ఫిర్యాదులను సీసీపీఏ సూమోటో గా స్వీకరించి తదుపరి చర్యలను తీసుకుంటుంది.

NSD

భారత్ బ్రాండ్....

దేశ ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన నిత్యవసర వస్తువులు అందజేయాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు భారత్ బ్రాండ్ పేరుతో నిత్యావసర సరుకులు పంపిణి చేస్తున్నట్లు నాఫెడ్ తెలంగాణ డిప్యూటీ మేనేజర్ ఆర్ ఎం పట్నాయక్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారత్ బ్రాండ్ సరుకుల ఆటోలను ఆయన ప్రారంభించారు.

--పిటిసి, కరీంనగర్

మంత్రివర్గ సమావేశం..

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈనెల 30 న జరగనుంది. కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

--డెస్క్

నిర్మల్ –ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు కోసం ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానంలో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ సర్వేలో తమ పేర్లు లేనివారు, తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తుతో గతంలో,ప్రజా పాలన కార్యక్రమంలో ఇచ్చిన రశీదు జిరాక్స్ కాపీని జత చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంపీడీవో కార్యాలయాలలో, పట్టణ ప్రాంత ప్రజలు మున్సిపల్ కార్యాలయాలలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చునన్నారు.

--పిటిసి,నిర్మల్

ప్రసార భారతి

ప్రసార భారతి సిఈఓ గౌరవ్ ద్వివేది ఈరోజు ప్రసార భారతికి చెందిన దూరదర్శన్, ఆకాశవాణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలు తీరు, వార్తల విశ్లేషణ, పని తీరు తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంటెన్ట్ విషయంలోను, రెవెన్యూ పెంచడానికి పలు సూచనలు ఆయన చేశారు. ఈ సమావేశంలో దూరదర్శన్, ఆకాశవాణి ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్.ఎస్.ఎమ్

వి.ఎల్.ఓలు....

ప్రతి రెవిన్యూ గ్రామానికి ఒక గ్రామస్థాయి అధికారి –వి.ఎల్.ఒ ను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి భూపరిపాలన ప్రధాన కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ జారీచేశారు. రాష్ట్రంలో 10 వేల 954 రెవిన్యూ గ్రామాలు ఉన్నాయి.

--డెస్క్

నిరసన

తమ సర్వీస్ ను క్రమబద్దీకరించాలని, అప్పటి వరకూ  పే స్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఈరోజు 15వ రోజు నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. నిరసన దీక్షకు కెరమెరి, సిర్పూర్ యు మండల విద్యాధికారులు ఆడే ప్రకాష్, సుధాకర్, సిపిఎస్ సంఘం అధ్యక్షుడు అజయ్ సంఘీభావం తెలిపారు.. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనిందని వారు పేర్కొన్నారు.

--పిటిసి, ఆసిఫాబాద్

వినోద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన ఏడాది పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని, ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం తప్ప,  మిగిలిన హామీలు అమలులోకి రాలేదని, కరీంనగర్ పార్లమెంటు మాజీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటై సంవత్సర కాలం పూర్తయినా, మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయలేదని అన్నారు.  ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

--పిటిసి, సిరిసిల్ల

చెక్కుల పంపిణీ....

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈ రోజు నిర్వహిస్తున్నారు. కళ్యాణ లక్ష్మి,  షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో, ప్రభుత్వ విప్,  వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొంటారు.

--పిటిసి రాజన్నసిరిసిల్ల

ఉచిత కుట్టు మిషన్లు:

తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ అందించేందుకు అర్హులైన వారి నుండి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమాదేవి తెలిపారు. ఆసక్తి, అర్హత గల మైనారిటీ మహిళలు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలనికోరారు.

--ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

Sports –Yadadri:

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని వెల్లంకి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. అభినయశ్రీ, జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పదో తరగతి చదువుతున్న అభినయశ్రీ ఈనెల 25 నుంచి 31 వరకు బీహార్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

--పిటిసి, యాదాద్రి

బియ్యం సరఫరా....

2022-23 రబీ సీజన్ కు సంబంధించి పెండింగ్ లో, ఉన్న బియ్యాన్ని, ఈనెల 31 వ తేదీ లోగా సరఫరా చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు.. జిల్లాలోని రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెలాఖరులోపు నిర్దేశిత సరఫరాలను పూర్తి చేయాలన్నారు.

--పిటిసి, రాజన్నసిరిసిల్ల

సింగరేణి వేడుకలు :

2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో నిన్న రాత్రి సింగరేణి 136వ ఆవిర్భావ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు రంగంలో వస్తున్న సవాళ్లను అధిగమించి సింగరేణి సంస్థను ప్రగతిపథంలో నడిపిస్తామని బలరాం తెలిపారు.

--పిటిసి, కొత్తగూడెం